అయిదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి



పార్టీ నేతలు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ శుభదృష్టి రాష్ట్రంపై ఉందని, రానున్న అయిదేళ్ల కాలంలో అన్ని రంగాల్లో ఒడిశా అభివృద్ధి సాధిస్తుందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. సోమవారం మధ్యాహ్నం కేంఝర్ జిల్లా పద్మపూర్ పరిధిలోని లక్ష్మీ మైదానంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎం మాట్లాడుతూ ప్రతిఒక్కరు పార్టీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేంఝర్ ఎంపీ అనంతనాయక్, ఇతర నేతలు పాల్గొన్నారు. కొంతమంది డిజిటల్ పద్ధతిలో భాజపా సభ్యత్వం తీసుకున్నారు.

వలసల నివారణకు టాస్క్‌ఫోర్స్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: వలసల నివారణకు ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ అధ్యక్షతన సోమవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైంది. ఇందులో మరో ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ, ఇతర శాఖల మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ఇతర శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు. వలసలు నివారించడానికి ఈ టాస్క్‌ఫోర్స్ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేస్తుందని తెలిసింది.

ఏటీఎంలకు వెళ్తే నిరాశే!



జిల్లాలో పలువురు వినియోగదారులు ఏటీఎం కేంద్రాలకు వెళ్లి నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఎక్కడా నగదు అందుబాటులో లేదన్న సందేశాన్ని మిషన్ల స్క్రీన్‌లపై వస్తుండడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దసరా పండగ వేళ చేతిలో చిల్లి గవ్వ అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొరాపుట్

రచ్చకెక్కిన బిజద విభేదాలు

- అమర్‌ను పొమ్మన్న లెనిన్
- నేనిప్పుడు స్వతంత్రుడ్ని: అమర్ ప్రసాద్

న్యూస్‌టుడే, భువనేశ్వర్

బిజదలో విభేదాలు రచ్చకెక్కాయి. ఆ పార్టీనేతలు ప్రసార సాధనాల ముందు నోరు పారేసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో కూడా అధినేత నవీన్ మౌనం ఆశ్చర్యానికి గురి చేస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆయన వెళ్లిపోవచ్చు



లెనిన్ మహంతి

బిజద ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన జాజ్‌పూర్ జిల్లా అగ్రనేత అమర్‌ప్రసాద్ శత్పధి పాండ్యన్ తమ నేత కాదని, ఆయనకు ఎన్నికల ప్రచార బాధ్యత అప్పగించి నవీన్ తప్పు చేశారని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇంతలో సోమవారం బిజద అధికార ప్రతినిధి విలేకర్లతో మాట్లాడుతూ మనసు చంపుకుని అమర్ పార్టీలో ఉండొద్దని, ఆయన బయటకు వెళ్లిపోవచ్చని పేర్కొన్నారు. ఆరుసార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించిన అమర్ కీలక పదవుల్లో కొనసాగి ఇప్పుడు అసంతృప్తి వ్యక్తం చేయడం దురదృష్టకరమని, ఆయన పార్టీ వీడితే మేలు జరుగుతుందని లెనిన్ చెప్పారు.



అమర్‌ప్రసాద్ శత్పధి

నేను పార్టీ సభ్యుడ్ని కాదు

జాజ్‌పూర్‌లో అమర్ విలేకర్లతో మాట్లాడుతూ తాను బిజద సభ్యత్వం స్వీకరించలేదని, ప్రస్తుతం ఏ పార్టీలోనూ లేనని, స్వతంత్రుడ్ని అని వ్యాఖ్యానించారు. ప్రముఖ రాజకీయ పార్టీలు తనకోసం తలుపులు తెరిచే ఉంచాయన్నారు. బిజద ఆవిర్భావంలో క్రియాశీలక పాత్ర పోషించిన తాను గతంలో ఎన్నికల సమయంలో అర్హులను ఎంపిక చేసి టిక్కెట్లు కేటాయించిన సంగతి గుర్తు చేశారు. తాను ఎవరి దయ, దాక్షిణ్యంపై ఆధారపడలేదన్నారు. ఎన్నికల ముందు, తరువాత తాను నవీన్‌ను కలుసుకోలేదని, తనను ఆయన పిలవలేదన్నారు. కోటరీని నమ్ముకున్నందున బిజద అధినేత అధికారానికి దూరమయ్యారన్నారు. పరిపక్వత లేని లెనిన్ వంటి నేతల వల్ల బిజదకు దుస్థితి దాపురించిందన్నారు. ఆ పార్టీ ప్రతిష్ఠ కోల్పోయిందన్నారు. తన రాజకీయ భవితవ్యం గురించి పూర్తి అవగాహనతో ఉన్నానని, సకాలంలో సరైన నిర్ణయం తీసుకుంటానన్నారు.

'రెరా' చట్టం సవరిస్తాం

- మంత్రి సురేష్



భువనేశ్వర్, న్యూస్‌టుడే: రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఆర్ఈఆర్ఏ) చట్టంలో సవరణలు చేయనున్నామని, దీనిపై పట్టణాభివృద్ధి శాఖ యంత్రాంగంతో చర్చిస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి సురేష్ పూజారి చెప్పారు. సోమవారం సంబల్‌పూర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నగరాలు, పట్టణాల్లో తమ అవసరాలకు సొంత స్థలాలు విక్రయించడానికి హక్కుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తనకు తెలిసిన వ్యక్తి ఒకరు కుమార్తె వివాహానికి తన స్థలంలో సగం విక్రయించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారని, స్థలాల విక్రయాల్లో దళారులు కీలక పాత్ర పోషిస్తూ పెద్దమొత్తాల్లో సొమ్ము గుంజుతున్నారన్నారు. రెరా చట్టం సవరణతో క్రయవిక్రయాలకు ఇబ్బందులుండవన్నారు. ఈ వ్యవహారంలో దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కొంతమంది దళారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలను తమ నివాసాల మాదిరిగా చేసుకున్నారని, వారి వ్యవహారానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందన్నారు. చట్ట సవరణ తరువాత అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద గట్టి నిఘా ఉంటుందని, క్రయవిక్రయాల్లో స్వచ్ఛత వస్తుందని సురేష్ తెలిపారు.

రాష్ట్రానికి రూ.8,068 కోట్ల కేంద్ర నిధులు



మొక్క నాటి నీరు పోస్తున్న సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్రం పన్నుల వాటా కింద ఒడిశాకు రూ.8,068 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తం సోమవారం ప్రభుత్వ ఖాతాలో జమయింది. కేంఝర్ జిల్లా రైకిలాలో సోమవారం ఉదయం 'అమ్మ పేరిట మొక్క' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి మొక్క నాటారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంపై ప్రత్యేక ఆదరణ చూపుతున్నారన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత ఉండదన్న ఆయన రానున్న అయిదేళ్లలో అన్ని రంగాల్లో ముందంజ వేస్తామన్న ఆశాభావంతో ఉన్నామన్నారు.

ఇబ్బందులు విన్నారు... అధికారులతో మాట్లాడారు



ముఖ్యమంత్రికి సమస్యలు వినిపిస్తున్న మహిళలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సొంత జిల్లా కేంఝర్ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌మాఝి సోమవారం ఉదయం ప్రభుత్వ అతిథి భవనంలో తన నియోజకవర్గానికి చెందిన కొంతమంది ప్రజల్ని కలిశారు. వారి ఇబ్బందులు విన్నారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు విన్న ఆయన సత్వర పరిష్కారానికి ఉన్నతాధికారులను ఆదేశించారు.


రాధా దామోదర రూపంలో జగన్నాథుడు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో సోమవారం నుంచి కార్తిక సేవలు ప్రారంభమయ్యాయి. ఆశ్వీయుజ శుక్లపక్షమి ఏకాదశి నుంచి కార్తిక శుక్లపక్షమి దశమి వరకు (నెల రోజులు) పురుషోత్తముడు భక్తులకు రాధాదామోదర రూపంలో దర్శనమిస్తాడు. కుమార పౌర్ణమి(ఈ నెల 17) నుంచి దీక్షాధారులు (హబిషార్థులు) స్వామి సన్నిధిలో వ్రతాలు చేస్తారు. దశమి నుంచి పౌర్ణమి వరకు శ్రీక్షేత్రంలో 'పొంచుక' వేడుకలు జరుగుతాయి. స్వామి బంకచూడ, వామన, లక్ష్మీనృసింహ, తివిక్రమ, రాజరాజేశ్వర అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తాడు.

2,500 మంది రిజిస్ట్రేషన్

కుమార పౌర్ణమి (గురువారం) రోజున హబిషార్థులు పూరీ చేరుకుంటారు. నెలరోజులు అక్కడే ఉంటారు. ఇంతవరకు 2,500 మంది హబిషార్థుల రిజిస్ట్రేషన్ జరిగినట్లు పూరీ జిల్లా పాలనాధికారి సిద్ధార్థ్ శంకర్ స్వయిన్ విలేకర్లకు చెప్పారు. ఈసారి ఎంతమంది వ్రతధారులు పాల్గొంటారన్నది గురువారం స్పష్టమవుతుందన్నారు. నాలుగుచోట్ల వారికి ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. నెలరోజుల పాటు వారుండే చోటుకు శ్రీక్షేత్రం నుంచి తీర్థప్రసాదాలు (ఒబడా) తెచ్చి అందివ్వడానికి సువార్ సేవాయత్‌లను నియమించామన్నారు. ఆలయానికి తీసుకెళ్లి తేవడానికి ప్రత్యేక వాహన సౌకర్యం, వసతి గృహాల్లో వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. శ్రీక్షేత్రం లోపల, వెలుపల గట్టి పోలీసు బందోబస్తు చేస్తున్నామన్నారు.

రైతులపై వరుణుడి కన్నెర్ర..



గజపతి జిల్లా గుసాని సమితిలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ భూములకు నీరు అందక రైతులు లబోదిబోమంటున్నారు. కొద్దిరోజులుగా వర్షాలు లేకపోవడంతో పంట భూములు నెర్రలు వారి కనిపిస్తున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో తగినంత వర్షం రాకపోవడంతో నష్టం వాటిల్లుతోందని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. కొన్నిచోట్ల చెరువులు, గుంతల నుంచి మోటార్లతో పొలాలకు నీరు అందిస్తున్నారు. – న్యూస్‌టుడే, పర్లాఖెముండి

నిమజ్జనోత్సవాల సందడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దేవీ శర్నవరాత్రోత్సవాల్లో బ్రహ్మపురలోని వివిధ చోట్ల తాత్కాలిక మండపాల్లో పూజలందుకున్న మహిషాసురమర్ధిని విగ్రహాల నిమజ్జనోత్సవాలు సోమవారం కోలాహలంగా జరిగాయి. విగ్రహాల నిమజ్జనాలకు బ్రహ్మపుర పురపాలక సంస్థ (బీఈఎంసీ) నగరంలోని నాలుగు ప్రాంతాల్లో తాత్కాలిక చెరువులు ఏర్పాటు చేసింది. ఎత్తయిన దుర్గమ్మ విగ్రహాలను వీటిలో నిమజ్జనం చేసేందుకు క్రేన్‌లు ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించింది. ఆయా తాత్కాలిక చెరువుల ఒడ్డున దుర్గమ్మ విగ్రహాలకు పూజల అనంతరం నిర్వాహకులు జయజయధ్వానాల మధ్య నిమజ్జనాలు చేశారు.



బ్రహ్మపురలో దుర్గమ్మ విగ్రహం ఊరేగింపు



తాత్కాలిక చెరువులో క్రేన్ సాయంతో విగ్రహం నిమజ్జనం

అమ్మలకు వీడ్కోలు



భువనేశ్వర్‌లో విగ్రహాల నిమజ్జనం



కటక్‌లో విగ్రహాల ఊరేగింపు వేడుక

భువనేశ్వర్, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల వేడుకలు ముగిశాయి. పూజా సంఘాలు సోమవారం అమ్మలకు వీడ్కోలు పలికాయి. రాష్ట్ర వ్యాప్తంగా దేవీ విగ్రహాల నిమజ్జనాలు జరిగాయి. ఈ నేపథ్యంలో భువనేశ్వర్, కటక్, రవుర్కెలా, సంబల్‌పూర్ నగరాలు, ఇతర పట్టణాల్లో విగ్రహాలను ఊరేగింపుగా నదుల ఒడ్డున తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువకులు నృత్యాలతో అమ్మవారి విగ్రహాలను ఊరేగించారు. భువనేశ్వర్, కటక్‌లలో మధ్యాహ్నం ఈ వేడుక ప్రారంభం కాగా మంగళవారం ఉదయం వరకు నిమజ్జనాలు కొనసాగనున్నాయి. కమిషనరేట్ పోలీసు యంత్రాంగం ఈ సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. కటక్‌లోని మహానది, కఠజోడి, భువనేశ్వర్‌లోని కువాఖయి, దయ నదుల ఘాట్‌ల వద్ద ఓడ్రాఫ్, అగ్నిమాపక సిబ్బంది నియమితులయ్యారు.

పీసీసీ అధ్యక్షుని ఎంపికపై మల్లగుల్లాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పీసీసీ పీఠం ఎవరికీ అచ్చి రాలేదు. దివంగత నేత జె.బి.పట్నాయక్ తరువాత ఈ పదవి చేపట్టినవారెవరూ రాణించలేకపోయారు. భువనేశ్వర్‌లోని కాంగ్రెస్ భవన్ కుమ్ములాటలకు నిలయమైంది. నేతల మధ్య అభిప్రాయభేదాలు, పరస్పర విమర్శలు సర్వసాధారణంగా మారాయి. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న పీసీసీ అధ్యక్ష పదవి ఎవర్ని వరిస్తుందన్నదిప్పుడు చర్చనీయాంశమైంది.



శ్రీకాంత్‌జెనా



శరత్‌రౌత్



మహమ్మద్ ముఖిం

శరత్ రాజీనామాతో ఖాళీ

సార్వత్రిక ఎన్నికలు ఈసారీ కాంగ్రెస్‌కు కలిసిరాలేదు. శాసనసభలో తృతీయ స్థానానికి పరిమితమైంది. ఓటమికి నైతిక బాధ్యత వహించి శరత్‌పట్నాయక్ పీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. జులై 21న ఏఐసీసీ అధిష్ఠానం అన్ని సంఘాలను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం 18 మంది పెద్దలతో స్టీరింగ సంఘం ఏర్పాటు చేసింది. ఇది పీసీసీ పదవికి అర్హులెవరన్న దానిపై సమగ్ర అధ్యయనం చేసి పార్టీ పెద్దలకు నివేదిక సమర్పిస్తుంది. దీని ఆధారంగా కొత్త అధ్యక్షుడి నియామకం జరుగుతుందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి అజయ్‌కుమార్ అప్పట్లో చెప్పారు. ఒక్కసారి మాత్రమే సమావేశమైన స్టీరింగ్ సంఘం పీసీసీ అధ్యక్ష పదవికి న్యాయం చేయగలిగేవారు ఎవరన్న దానిపై నిర్ణయం తీసుకోలేకపోయింది. అధిష్ఠానానికే వదిలేసింది.



భువనేశ్వర్‌లోని కాంగ్రెస్ భవన్

ఇది సాధ్యమేనా?

కాంగ్రెస్‌వర్గాల సమాచారం మేరకు అధిష్ఠానం పెద్దలు రాష్ట్ర నాయకులతో 'ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్‌కు దిశా నిర్దేశం చేసి, ముందుకు నడిపించే సమర్థులెవరన్న దానిపై వారి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. కేంద్ర మాజీ మంత్రి శ్రీకాంత్‌జెనా, సీనియర్ నాయకులు శరత్‌రౌత్, మహమ్మద్ ముఖింల గురించి దిల్లీ పెద్దలు ఆరా తీస్తున్నారు. ఈ ముగ్గురిలో ఎవరు న్యాయం చేయగలుగుతారన్న దానిపై ఫోన్‌ఇన్ చర్చ జరుగుతోంది. హరియాణా, జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ దిల్లీ పెద్దలు తీరికలేకుండా అయిపోయారు. ఒడిశా వ్యవహారాలపై దృష్టి సారించలేకపోయారని, ఎన్నికలు ముగిసినందున ఇక పీసీసీ అధ్యక్ష పదవికి సంబంధించి త్వరలో నిర్ణయం తీసుకుంటారని రాష్ట్ర నేతలంటున్నారు. ఫోన్‌ల ద్వారా నేతలతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకోవడం ప్రహసనం అని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

ఏ జిల్లాలోనూ అనుకూలంగా లేదు

రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి దారుణంగా ఉంది. అన్ని సంఘాలు రద్దయిన తరువాత జిల్లాల్లో ఎవరికి వారే అన్న చందంగా నేతలు వ్యవహరిస్తూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. భువనేశ్వర్‌లో ఛాత్ర యువజన కాంగ్రెస్ శ్రేణులు ఉనికి చాటుకోవడానికి నామమాత్రంగా ఆందోళనలు చేస్తున్నాయి. రాజధానిలోని పార్టీ కార్యాలయానికి ఎవరూ వెళ్లడం లేదు. ఎన్నికల తరువాత దీన్ని తెరిచేవారే కరవయ్యారు. కాంగ్రెస్‌కు విధేయంగా ఉన్న కొందరు నేతలు రాష్ట్రంలోని పార్టీ పరిస్థితిపై ఏఐసీసీకి లేఖలు రాసినట్లు తెలిసింది.

త్వరలో నియామకం

పీసీసీ మాజీ అధ్యక్షుడు జయదేవ్ జెనా ఆదివారం రాత్రి భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ దిల్లీ అధిష్ఠానం పీసీసీ అధ్యక్షుడ్ని నియమించడానికి సన్నాహాలు ప్రారంభించినట్లు చెప్పారు. త్వరలో ఈ ప్రక్రియ పూర్తవుతుందని, జిల్లాల్లోనూ అధ్యక్ష పదవులు భర్తీ అవుతాయన్నారు. పీసీసీ నేత ఎంపిక ఏకాభిప్రాయంతో జరుగుతుందని, ముగ్గురి పేర్లు ఏఐసీసీ పరిశీలనలో ఉన్నాయని చెప్పారు.




కాలిపోతున్న బస్సు

ద్విచక్ర వాహనం ఢీకొని బస్సులో చెలరేగిన మంటలు

- ఇద్దరి దుర్మరణం..
- త్రుటిలో తప్పించుకున్న ప్రయాణికులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన అనంతరం బస్సులో మంటలు చెలరేగిన ఘటన జాజ్‌పూర్ జిల్లాలో సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ మహిళ, మరో వ్యక్తి ఘటనా స్థలంలోనే మృతిచెందారు. బరియా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భువనేశ్వర్ నుంచి బాలేశ్వర్ వైపు వెళ్తున్న ఓ బస్సు ఎన్‌హెచ్-16పై ఛతియా సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఇది జరిగిన కాసేపటికే బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. మంటలను గుర్తించిన ప్రయాణికులు వెంటనే బస్సు నుంచి కిందికి దిగిపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న చండికోల్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో మృతిచెందిన వారి వివరాలు ఇంకా తెలియలేదన్నారు. మృతులిద్దరూ దంపతులై ఉంటారని భావిస్తున్నారు. పరీక్ష కోసం మృతదేహాలను ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సాగునీరివ్వండి: రైతుల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న అన్నదాతలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా గుసాని సమితి గురండి ఠాణా పరిధిలోని బాగుసల, కోరసొండ, ఉప్పలాడ, కెరండి పంచాయతీల రైతులు వ్యవసాయ భూములకు నీరందించాలంటూ సోమవారం సాయంత్రం ఏడో మైలు కూడలి వద్ద రాస్తారోకో చేపట్టారు. అన్నదాతలు మాట్లాడుతూ.. పొలాల సమీపంలో ఉన్న కాలువలు శుభ్రం చేయకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతుందని, 7వ మైలు కూడలి ప్రాంతంలో ఉన్న దుకాణాదారులు వ్యర్థాలను కాలువలో వేయడంతో సాగునీరు వెళ్లడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌డీపీఓ మాధవానంద నాయక్, ఠాణా అధికారి రవీంద్రపాత్ర్, తహసీల్దార్ నారాయణ బెహరా, నీటి పారుదల శాఖ ఇంజినీరు ఆశీష్ మల్లిక్ రైతుల వద్దకు వెళ్లారు. వారితో చర్చించి త్వరితగతిన సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కర్షకులు ఆందోళన విరమించారు. పర్లాఖెముండి-మోహన-గంజాం జిల్లా బ్రహ్మపుర ప్రధాన రహదారి కావడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో మెరిసిన రాష్ట్ర క్రీడాకారులు

ఒడిశాకు 19 పతకాలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించిన జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఇందులో చివరిరోజు జరిగిన 109 కిలోల శరీరబరువు విభాగంలో రాష్ట్ర సీనియర్ లిఫ్టరు అమర్‌జీత్ మహరణా స్నాచ్‌లో 122 కిలోలు, క్లీన్‌జర్క్‌లో 161 కిలోలు బరువులెత్తి ఒక రజత పతకం గెలుచుకున్నారు. రాష్ట్ర లిఫ్టరు జ్యోత్స్నసబర్ మొత్తం పోటీల్లో యువ బాలికల విభాగంలో ఉత్తమ లిఫ్టరుగా బహుమతి పొందినట్లు ఒడిశా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె.రవికుమార్ సోమవారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఈ పోటీల్లో రాష్ట్రానికి మొత్తం 19 పతకాలు వరించాయి.



పతకంతో అమర్‌జీత్ మహరణా



ఉత్తమలిఫ్టరుగా బహుమతి పొందిన జ్యోత్స్న సబర్

రోడ్డు ప్రమాదంలో అగ్నివీర్ జవాన్ మృతి



సైకత్ సీట్ (పాతచిత్రం)

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో అగ్నివీర్ జవాను దుర్మరణం చెందడంతో ఝర్‌గ్రామ జిల్లా బీన్పూర్ పరిధిలోని సుక్టోరో గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సైకత్ సీట్(21) బాల్యం నుంచే దేశభక్తి ఎక్కువ. పట్టభద్రుడు అయ్యాక తల్లిదండ్రులతో వాదించి మరీ ఎంతో శ్రమించి అగ్నివీర్ జవాన్‌గా ఏప్రిల్ 2024లో ఎంపికయ్యారు. సికింద్రాబాద్ శిక్షణ కేంద్రంలో చోటు సంపాదించుకున్నారు. ఫైరింగ్‌లో శిక్షణ పొందేందుకు ఇటీవల తోటి జవాన్లతో కలిసి నాసిక్ అటారీస్టేషన్‌కు వెళ్లారు. ఈ నెల 10వ తేదీన అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. 12వ తేదీన ఆ జవాను పార్థివదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. సైనిక లాంఛనాలతో అగ్నివీర్ జవాన్‌కు కన్నీటితో వీడ్కోలు పలికారు. పెద్దసంఖ్యలో ప్రజలు అంతిమయాత్రలో పాల్గొని యువ జవానుకు నివాళులర్పించారు.



ఆదమరిస్తే ప్రమాదమే


పర్లాఖెముండి పట్టణంలోని ఇండియన్ పెట్రోల్ బంకు ప్రాంతంలో వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న కల్వర్టుపై సిమెంట్ పలకలు తొలగించడంతో ప్రమాదకరంగా మారింది. రెండు వారాల కిందట మురుగు నీరు ప్రధాన రహదారిపై చేరి ప్రవహించడంతో సిమెంట్ పలకలను పగులకొట్టి సమస్య పరిష్కరించారు. తిరిగి అక్కడ పలక ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై పురపాలక ఉపాధ్యక్షుడు లెంక మధు వద్ద సమస్యను ప్రస్తావించగా వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, పర్లాఖెముండి

రహదారులు నిర్మించరూ!



కొరాపుట్ సమితిలోని జానిగూడ గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్సులు సైతం రాలేని పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామ పరిస్థితి ఇలా ఉంటే.. మారుమూల గ్రామాల పరిస్థితి ఏంటనే ప్రశ్న తలెత్తుతోంది. గిరి గ్రామాలకు రోడ్ల వసతి కల్పిస్తే అధికశాతం సమస్యలు తీరిపోతాయని స్థానికులు వేడుకుంటున్నారు. – న్యూస్‌టుడే, కొరాపుట్

వెలగని వీధి దీపాలు



రాయగడ జిల్లా కొలనార సమితి సూరి పంచాయతీ కేంద్రంలో 3 నెలలుగా వీధి దీపాలు వెలగక గ్రామస్థులు చీకట్లో కాలం గడుపుతున్నారు. సౌర దీపాలున్నా అవి కూడా పనిచేయడంలేదని, రాత్రి వేళ బయటకు రావాలంటే భయంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. తాగునీరు సరఫరా చేసే పంపుహౌస్‌కి రెండు నెలలుగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయి మోటార్లు పనిచేయక వీధి కుళాయిల నుంచి తాగునీరు రావడం లేదు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై సమితి అభివృద్ధి అధికారి రీనా ప్రధాన్ మాట్లాడుతూ వెంటనే విద్యుత్తు మరమ్మతులు చేపట్టాలని, సంబంధిత విభాగానికి ఆదేశించినట్లు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, రాయగడ గ్రామీణం

రాయగడలో వర్షం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా దక్షిణ ఒడిశా రాయగడలో సోమవారం సాయంత్రం వాన కురిసింది. వారం రోజులుగా భరించలేని ఎండ వేడిమితో ఇబ్బందులు పడిన ప్రజలకు ఈ వానతో ఉపశమనం కలిగింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షానికి రాయగడ రైల్వేనిలయం, మజ్జిగౌరమ్మ ఆలయ రహదారుల్లో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. – న్యూస్‌టుడే, రాయగడ గ్రామీణం



గండాహతిలో పర్యాటకుల సందడి



గజపతి జిల్లా రాయగడ సమితిలోని గండాహతి జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. దసరా సెలవులు కావడంతో చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ఆంధ్రాలోని శ్రీకాకుళం జిల్లా నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వందలాది సంఖ్యలో పాల్గొని సంతోషంగా జలపాతం వద్ద సందడి చేశారు. జలపాతం అందాలను ఆస్వాదిస్తూ జలకాలాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆ ప్రాంతంలో పర్యాటకులు రద్దీ కాస్త కనిపించింది. – న్యూస్‌టుడే, పర్లాఖెముండి

వినతుల స్వీకరణ



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న పాలనాధికారి దాస్, పక్కన ఎస్పీ జతేంద్రకుమార్

పర్లాఖెముండి, గుణుపురం, న్యూస్‌టుడే: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి సమితి సియాలిలాటీ పంచాయతీ కార్యాలయంలో పాలనాధికారి బిజయ్‌కుమార్‌దాస్ అధ్యక్షతన సోమవారం వినతులు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ చుట్టుపక్కల గ్రామాల నుంచి 119 వినతులు అందాయి. జిల్లా సామాజిక భద్రత శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారుడికి రూ.2 లక్షల 50 వేల చెక్కు, 43 మందికి అటవీ భూమి పట్టాలు, ఒకరికి చక్రాల కుర్చీ, మరో నలుగురికి పింఛను కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ జతేంద్రకుమార్ పండా, బీడీఓ లారిమాన్ ఖర్షల్ పాల్గొన్నారు. ● రాయగడ జిల్లా పద్మపురం సమితి కార్యాలయంలో జిల్లా పాలనాధికారి వినతులు స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. జిల్లా అదనపు పాలనాధికారి(ఏడీఎం) భాస్కర రొయితొ పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా 28 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎస్పీ స్వాతీ ఎస్ కుమార్, సబ్‌కలెక్టర్ కిరణ్‌దీప్‌కౌర్ సహోతా, సమితి అధ్యక్షురాలు మణిమాల సబర, జిల్లా వైద్యాధికారి డా. లాల్‌మోహన్ రౌత్రాయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బిజద మునిగిపోతున్న నావ: ప్రతాప్



ప్రతాప్‌చంద్ర షడంగి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజదలో కుమ్ములాటలు తీవ్రమయ్యాయని, ఆ పార్టీ పరిస్థితి మునిగిపోతున్న నావలా మారిందని, అధినేత నవీన్‌పట్నాయక్ కాపాడే స్థితిలో లేరని బాలేశ్వర్ ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగి అన్నారు. సోమవారం బాలేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ క్రమశిక్షణ, కేడర్ లేని పార్టీలు దీర్ఘకాలం మనుగడ సాగించలేవన్నారు. బిజదలో నెలకొన్న పరిణామాలకు ఆ పార్టీ అధినేత బలహీనతే కారణమన్నారు. అమర్‌ప్రసాద్ శత్పథి భాజపా గూటికి చేరతారా? అన్న ప్రశ్నకు ప్రతాప్ సమాధానమిస్తూ..ఇది పార్టీ నాయకత్వం పరిశీలిస్తుందన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆశాల నిరసన



ర్యాలీగా వెళ్తున్న ఆశా కార్యకర్తలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఒడిశా రాష్ట్ర ఆశా కార్మికుల సంఘం నిరసనకు దిగింది. బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగేశ్వర్‌దాస్ నేతృత్వంలో సంఘం రాయగడ శాఖ సభ్యులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆశా కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ విరమణ అనంతరం నెలకు రూ.5 వేల పింఛను చెల్లించాలని డిమాండ్ చేశారు. విధులు నిర్వహణ కోసం రాకపోకలు సాగించేందుకు శూన్య వడ్డీ రేటుకి రుణాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పేరిట వేర్వేరుగా రాసిన వినతి పత్రాలను డిప్యూటీ కలెక్టర్ లలిత్ మండల్‌కు అందజేశారు. బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.మోహనరావు, తమల సాహుకార్, గీతాంజలి హియాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అవతారంలో జగన్నాథుడు



శబరి శ్రీక్షేత్రం కొరాపుట్‌లో సోమవారం జగన్నాథుడిని రాజరాజేశ్వరి అవతారంలో అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు దేవదేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారి దర్శనానికి తరలివచ్చారు. – న్యూస్‌టుడే, కొరాపుట్

సరస్ మేళాలో కొరాపుట్ ఉత్పత్తుల స్టాల్



హరియాణాలో ఏర్పాటు చేసిన కొరాపుట్ ఉత్పత్తుల స్టాల్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా హరియాణాలోని గుర్గాంలో దసరా సందర్భంగా నిర్వహిస్తున్న సరస్ మేళాలో కొరాపుట్ జిల్లా ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటైంది. కొరాపుట్ సమితి పద్మపూర్ పంచాయతీ పరిధిలో మోహన్‌పొడ గ్రామానికి చెందిన పృథ్వీ, నారాయణపట్టణం సమితి మజ్జియాంబకు చెందిన స్వయం సహాయక సంఘాల ద్వారా కొరాపుట్ ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌లో కొరియా కొండ చీపుర్లు, బొరిగుమ్మకు చెందిన బెల్లం, సిమిలిగుడకు చెందిన మిరియాలు, నారాయణపట్టణానికి చెందిన వివిధ ఉత్పత్తులు, కొరాపుట్‌కు చెందిన మిల్లెట్‌తో తయారైన సామగ్రిని విక్రయిస్తున్నారు. కొరాపుట్ ఉత్పత్తులకు మంచి గిరాకీ ఏర్పడుతుందని ఓర్మాస్ జిల్లా సమన్వయకర్త రోషన్ కార్తిక్ తెలిపారు.

విలక్షణం జగన్నాథ సంస్కృతి

● రావణ దహనం వేడుకల్లో ప్రభాతి



మండుతున్న రావణుని కటౌట్



రావణుని కటౌట్‌కి అగ్గి వెలిగిస్తున్న ఉప ముఖ్యమంత్రి ప్రభాతి



సిమిలిగుడ: పెద్దసొరపల్లిలో రావణుడి బొమ్మ

భువనేశ్వర్, సిమిలిగుడ, న్యూస్‌టుడే: వైష్ణవ, శాక్తేయ, శైవ శక్తుల మేలిమి కలయికతో నిండిన శ్రీజగన్నాథ సంస్కృతి విలక్షణమైనదని, సమైక్య భారతతత్వానికి ఇది అద్దం పడుతుందని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడ చెప్పారు. ఆదివారం రాత్రి భువనేశ్వర్‌లోని నయాపల్లి మైదానంలో రావణ దహనం వేడుక ఏర్పాటైంది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభాతి రావణుని కటౌట్‌కి నిప్పు అంటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసత్యంపై సత్యం జయిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్నాథతత్వాన్ని జీర్ణించుకున్నారని, శాంతికి ప్రతీకలని చెప్పారు. ● లక్ష్మీపూర నియోజకవర్గం పరిధిలోని బందుగాం సమితి పెద్ద సోరపల్లిలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రావణ దహన ఉత్సవం ఉత్సాహంగా సాగింది. జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు సస్మిత మెలకా ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గంగమ్మ చెంతకు దుర్గమ్మ



సిమిలిగుడలో దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు



కంసావతి నదిలో దుర్గమ్మ నిమజ్జనం



పర్లాఖెముండిలో అమ్మవారి ప్రతిమ ఊరేగింపు

పర్లాఖెముండి, ఖరగ్‌పూర్, సిమిలిగుడ, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మండపాల్లో నెలకొల్పి పూజలు చేసిన దుర్గా మాత విగ్రహాలను మేళతాళాలతో వైభవంగా ఊరేగింపు చేపట్టి గంగమ్మ చెంతకు తరలించారు. ● ఖరగ్‌పూర్ పట్టణంలో దుర్గమ్మ నిమజ్జన సందడి మొదలైంది. పోలీసులు ఆదేశాల మేరకు అమ్మవారి నిమజ్జనాలు కంసావతి నది, పెద్ద తటాకాలలో జరుగుతున్నాయి. ● సిమిలిగుడ, సునాబెడ, దమన్‌జోడి ప్రాంతాల్లో దుర్గమ్మ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు



బాలభవన్ విద్యార్థుల నృత్యం



వివిధ రకాల శిలాజాల ప్రదర్శన

విజయనగరం విద్యావిభాగం, ఉడాకాలనీ, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా మహారాజా కోటలో నిర్వహించిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శన సోమవారం సాయంత్రంతో ముగిసింది. శిలాజాల ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లావ్యాప్తంగా పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు 220 ప్రాజెక్టులొచ్చాయి. పదింటిని ఉత్తమ బహుమతులు, మరో అయిదింటికి కన్సోలేషన్ అవార్డులు అందజేశారు. చీపురుపల్లి, రాజాం బాలభవన్ విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఉత్సవాల జీవితకాల సభ్యురాలు మేకా అనంతలక్ష్మి, డీఈవో ఎన్.ప్రేమకుమార్, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎం.ఆదినారాయణ, జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు, పరీక్షల విభాగం ఇన్‌ఛార్జి సహాయ కమిషనర్ టి.సన్యాసిరాజు, విద్యాశాఖ ఏడీలు గౌరీ శంకరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కప్ క్రికెట్ శిక్షణ శిబిరానికి అంధ క్రీడాకారులు



దేబరాజ్ బెహరా



పంకజ్ భుయ



సుఖ్‌రామ్ మాఝి



నకుల బడనాయక్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: క్రికెట్ అసోసియేషన్ ఫర్‌ది బ్లైండ్ ఇన్ ఇండియా (సీఏబీఐ) నాలుగో టీ20 ప్రపంచ కప్ క్రికెట్ పోటీలకు భారత జట్టును సిద్ధం చేస్తోంది. పాకిస్థాన్‌లో ఈ ఏడాది నవంబరులో జరగనున్న ఈ పోటీల కోసం భారత క్రికెటర్లకు శిక్షణ శిబిరం నిర్వహించనుంది. దిల్లీలో ఈనెల 27వ తేదీ నుంచి కొద్దిరోజులు నిర్వహించనున్న శిక్షణ శిబిరంలో భారత జట్టు క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ కల్పించనున్నారు. ఈ మేరకు క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది విజువల్లీ ఇంపెయిర్డ్ (సీఏవీఐ) ఒడిశా అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ సోమవారం 'న్యూస్‌టుడే'కు ఆ వివరాలు వెల్లడించారు. భారత జట్టులో నలుగురు రాష్ట్ర అంధ క్రీడాకారులు స్థానం పొందడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. వీరు దిల్లీలో వివిధ మైదానాల్లో జరగనున్న శిక్షణ శిబిరంలో తర్ఫీదు పొందుతారని ఆయన చెప్పారు. రాష్ట్రం నుంచి దేబరాజ్ బెహరా, పంకజ్ భుయ, నకుల బడనాయక్, సుఖ్‌రామ్ మాఝి ఎంపికయ్యారని ఇక్బాల్ పేర్కొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మచ్ఛో

సిమిలిగుడ అభివృద్ధికి కృషి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని కొరాపుట్ ఎమ్మెల్యే రఘురామ్ మచ్ఛో అన్నారు. సిమిలిగుడలో జరుగుతున్న దుర్గాపూజల్లో భాగంగా ఎమ్మెల్యే మచ్ఛో ఆదివారం రాత్రి పూజా మండపాలను సందర్శించారు. శివశక్తి వాణిజ్య సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే మచ్ఛో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దుర్గాపూజలకు సిమిలిగుడ పట్టణం ప్రాధాన్యత సంతరించుకుందని, ఇక్కడ ఎంతో సందడి వాతావరణం నెలకొంటుందని అన్నారు. స్థానిక కళాకారులను ఈ ఉత్సవాల ద్వారా ప్రోత్సహించాలన్నారు. సంఘం, పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్రకుమార్ పాత్రో ఆధ్వర్యంలో, కార్య నిర్వాహక అధ్యక్షుడు రమేష్, సభ్యులు గోవర్ధన్‌జెనా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు భారీ ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'భరద్వాజ ప్రతిష్ఠాన్' ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నీలకంఠనగర్ ప్రాంతంలోని హరిహరనగర్‌లో ఉచితంగా ఆరోగ్య పరీక్షల శిబిరం జరిగింది. వైద్యుడు నకుల్ సాహు పాల్గొని పలువురు వృద్ధులకు రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు తదితరాలు పరీక్షించారు. అవసరమయ్యే వారికి ఉచితంగా ఔషధాలు అందజేశారు.



శిబిరంలో పాల్గొన్న వైద్యుడు నకుల్ సాహు

రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో 'కిస్'కు 11 పసిడి పతకాలు



పసిడిపతకాలతో దివ్యరంజన్ ముండ (కిస్)



విలువిద్యలో క్రీడాకారుల పోటీ

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: సంబల్‌పూర్‌లోని జుజొముడాలో నాలుగు రోజులు నిర్వహించిన 25వ రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో వివిధ జిల్లాలకు చెందిన అండర్-15, సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ పురుషులు, మహిళా క్రీడాకారులు పోటాపోటీగా పాల్గొన్నారు. మొత్తం పోటీల్లో భువనేశ్వర్‌కు చెందిన కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (కిస్) క్రీడాకారులు వివిధ విభాగాల్లో సత్తా చాటి 11 పసిడి పతకాలు సాధించారు. కిస్‌కు చెందిన క్రీడాకారులు దివ్యరంజన్ ముండ, మనస్విని హస్దక్, బులు మల్లిక్, సాగర్‌రైతా, లిల్లీమఝి, చందమణి మండి, రిష్మమల్లిక్ తదితరులు అధిక పతకాలు చేజిక్కించుకున్నారు. ఇతర స్థానాల్లో కేంఝర్, సంబల్‌పూర్, సుందర్‌గఢ్ తదితర జిల్లాల క్రీడాకారులు పతకాలు దక్కించుకున్నారు.

పోలీసుల అదుపులో బాబా

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఓ యువతిని అపహరించాడన్న ఆరోపణలపై ఢెంకనాల్ పోలీసులు ఓ బాబాను అరెస్టు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. కటక్ జిల్లా టిగిరియా పోలీసుస్టేషన్ పరిధిలోని సోంపాడలో కైబల్యజానీ అనే బాబా ఓ ఆశ్రమాన్ని నిర్వహిస్తూ తనకు దైవ శక్తులు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నాడు. మహిళలను మోసగిస్తున్నాడని, తన కుమార్తెను జానీ అపహరించాడని ఓ బాధితుడు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం ఆ ఆశ్రమం వద్దకు చేరుకొని బాబాను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అయనకు సంబంధించిన వస్తువులను తనిఖీ చేయగా, అందులో లైంగిక సామర్థ్యాన్ని పెంచే మాత్రలు, ఇతర అభ్యంతరకర సామగ్రిని పోలీసులు గుర్తించారు. అత్యంత సన్నిహితులైన మహిళతో జానీ అభ్యంతరకర రీతిలో ఉన్న ఫొటోలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

101 మంది జూదరుల అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం పోలీసు జిల్లాలోని వివిధ ఠాణాల పరిధుల్లో ఈనెల 5వ తేదీ నుంచి ఆదివారం వరకూ వివిధ చోట్ల సాగుతున్న జూద శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. 101 మంది జూదరుల్ని అరెస్టు చేశామని గంజాం పోలీసు జిల్లా నిఘా విభాగం డీఎస్పీ రంజన్ కుమార్ దే సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా దాడుల్లో రూ. 3,99,955ల నగదు, 3 కార్లు, 24 ద్విచక్ర వాహనాలు, 23 చరవాణులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆయా పోలీసు స్టేషన్ల పరిధుల్లో అక్రమ దేశీ, విదేశీ మద్యం దుకాణాలపై దాడులు జరిపి, 45 కేసులు నమోదు చేశామన్నారు. ఆయా దాడుల్లో 568 లీటర్ల అక్రమ సారా, 103 లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం చేసుకుని మొత్తం 45 మందిని అరెస్టు చేశామని డీఎస్పీ రంజన్ దే ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



బాధిత వ్యాపారులతో మాట్లాడుతున్న అస్కా శాసనసభ్యుడు సరోజ్ పాఢి

కాయగూరల బజారులో అగ్ని ప్రమాదం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా అస్కా పట్టణంలో లక్ష్మీ బజారులోని కాయగూరల బజారులో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్ని ప్రమాదం సంభవించింది. దుకాణాల్లో దేవీ పూజలకు వెలిగించిన దీపం కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా తెలిసింది. సుమారు పదిహేను దుకాణాల్లోని సామగ్రి మంటల్లో కాలిపోయాయి. అస్కా శాసనసభ్యుడు సరోజ్‌కుమార్ పాఢి ఆదివారం ప్రమాదం జరిగిన బజారుకు వెళ్లి పరిస్థితిని పరిస్థితిని పరిశీలించారు. బాధిత వ్యాపారులు తమకు న్యాయం చేయాలని శాసనసభ్యుడు పాఢికు వినతి చేశారు. రెవెన్యూ అధికారులు బజారుకు చేరుకుని బాధిత వ్యాపారులకు పాలీథిన్లు పంపిణీ చేశారు.

సముద్రంలో మత్స్యకారుని గల్లంతు



ఈ. గురుమూర్తి(పాతచిత్రం)

గోపాలపూర్, న్యూస్‌టుడే: గోపాలపూర్ సాయినగర్ బస్తీకి చెందిన మత్స్యకారుడు ఈ.గురుమూర్తి(36) సముద్రంలో గల్లంతయ్యాడు. ఆయన ఆచూకీ తెలియలేదు. ఆదివారం సాయంత్రం స్వర్గద్వార తీర ఘాట్‌లో స్నానానికి వెళ్లిన గురుమూర్తి తిరిగి రాలేదు. మత్స్యకారులు గాలించినా ఆచూకీ తెలియలేదు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నించి విఫలమయ్యారు. చీకటి పడినందున గాలింపు నిలిపివేశారు. సోమవారం ఉదయం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైనా ఆచూకీ తెలీదు. గోపాల్‌పూర్‌కి ప్రాతినిధ్యం వహిస్తున్న వాణిజ్య, రవాణా శాఖల మంత్రి బిభూతి భూషణ్ జెనా ఉత్తర్వుల మేరకు కోస్ట్‌గార్డ్ దళాలు వజ్రపుకొత్తూరు (పలాస) నుంచి రంభ (గంజాం జిల్లా) వరకు పెట్రోలింగ్ చేశాయి. ఈ నేపథ్యంలో సాయినగర్ బస్తీలో విషాదఛాయలు అలముకున్నాయి. గురుమూర్తి గజ ఈతగాడు కాగా అతడు ఏదో తీరానికి సురక్షితంగా చేరుకుని ఉంటాడని కొందరంటున్నారు.

అనుమానాస్పదస్థితిలో ఉద్యోగి మృతి



జయకుమార్ నాయక్ (పాతచిత్రం)

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఉద్యోగి మృతి చెందిన ఘటన గుసాని సమితి గారాబంద ఠాణా పరిధిలోని గారబంద గ్రామంలో సోమవారం కలకలం రేపింది. ఠాణా అధికారి ప్రశాంత్ నిషిక తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా జాడుపల్లి గ్రామానికి చెందిన జయకుమార్ నాయక్(58) గారబందలో పశువైద్యశాఖ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి ఆయన స్వగృహంలో ఉన్నారు. సోమవారం ఉదయం ఆయన వాహన చోదకుడు ఇంటికి వెళ్లి తలుపులు కొట్టినా తీయకపోవటంతో చుట్టుపక్కల వారికి సమాచారం అందించారు. స్థానికులు తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి చూశారు. కంచంలో భోజనం ఉంది. ఆ పక్కనే ఆయన పడి ఉన్నారు. స్థానికులు వెళ్లి పరిశీలించి అప్పటికే జయకుమార్ మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రధానాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

సిరులతల్లి తొలేళ్లు.. ఇంటింటా సంబరాలు



చదురుగుడి పరిసరాల్లో విద్యుత్తు వెలుగులు



ఘటంతో భక్తురాలు

- భక్తిశ్రద్ధలతో సాగిన ఘటాల పూజలు
- నేటి మధ్యాహ్నం సిరిమానోత్సవం


విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు.. పూసపాటి వంశీయుల ఆడబిడ్డ.. పైడిమాంబ తొలేళ్ల సంబరం సోమవారం కనుల పండువగా సాగింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 8 గంటల సమయంలో ఆలయ అనువంశిక ధర్మకర్త, గజపతుల వారసుడు పూసపాటి అశోక్ గజపతిరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వచ్చారు. వేదపండితులు తాతా రాజేష్, నాగేంద్రశర్మ, దూసి శివప్రసాద్, దూసి కృష్ణమూర్తి మంత్రోచ్చారణల నడుమ మాన్సాస్ కార్యనిర్వహణాధికారి కేఎన్‌డీవీ.ప్రసాద్, దేవస్థానం ఈవో డీవీవీ.ప్రసాదరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలో తమ ఆడపడుచుకు పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వనంగుడికి వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించి, పూజలు చేశారు. ప్రజలపై అమ్మవారి చల్లని దీవెనలు ఉండాలని అశోక్ ఆకాంక్షించారు.

క్యూలైన్లన్నీ కిటకిట

తొలేళ్ల సందర్భంగా తల్లి దర్శనాలకు తెల్లవారుజామున 5 గంటల నుంచే భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు ఘటాలను సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించాయి. హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మేయర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్, పండగ ముఖ్య అధికారి త్రినాథరావు, ద్వారకా తిరుమల దేవస్థానం ఈవో మూర్తి తదితరులు దర్శించారు. అర్ధరాత్రి పూజారి బంటుపల్లి వెంకటరావు రైతులకు విత్తనాలు అందజేసి, తొలేళ్ల క్రతువును ముగించారు.



పూజలు చేస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, ఆయన కుమార్తె అదితి గజపతిరాజు



దర్శనాలకు బారులుదీరిన భక్తులు



హోం మంత్రి అనితకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు



కోట నుంచి సారెతో వస్తున్న గజపతుల కుటుంబ సభ్యులు, చిత్రంలో ఎంపీ కలిశెట్టి తదితరులు



సారెతో దేవస్థానం వేద పండితులు, అర్చకులు



వనంగుడి అమ్మవారు



ఘటాలతో తలయారులు



చిన్నారుల కర్రసాము

ఆటకు ఆయువు పోయాలి

- జిల్లాలో క్రీడా మైదానాలు, పరికరాల కొరత
- సరైన శిక్షణ లేక వెనకబాటు

క్రీడావికాస కేంద్రాలు: ప్రస్తుతం మన జిల్లాలో ఆమదాలవలస, టెక్కలి, పాతపట్నంలో మాత్రమే వికాసకేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. పలాస, ఇచ్ఛాపురం తదితర చోట్ల ఇండోర్‌స్టేడియంలు అసంపూర్తిగా దర్శనమిస్తాయి. పలాసలో వికాసకేంద్రానికి స్థలం కేటాయించాల్సి ఉంది.

మైదానాలు: జిల్లాలో చాలా పాఠశాలల్లో మైదానాలు లేవు. దీంతో క్రీడాసాధనకు ఇబ్బందితో పాటు రాష్ట్ర, జాతీయ పోటీల నిర్వహణ కూడా కష్టతరమవుతుంది. ఉదాహరణకు వజ్రపుకొత్తూరులో మైదానం లేనందున గత నెలలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలను పాఠశాల ఆవరణతోపాటు ప్రైవేటు స్థలంలో నిర్వహించారు. కొత్తపల్లి, అంబుగాం(మందస), మామిడిపల్లి (సోంపేట), బూరగాం(కంచిలి), పెద్దతామరాపల్లి (నందిగాం), సీతాపురం(టెక్కలి).. ఇలా పలు చోట్ల మైదానాలు లేవు. అలాగే పలాసలో 400ట్రాక్ లేనందున గతంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగిన సందర్భంలో ప్రైవేటు స్థలంలో ట్రాక్ ఏర్పాటు చేయాల్సి వచ్చింది.



ట్రాక్ లేని పలాస క్రీడామైదానం

న్యూస్‌టుడే, పలాస క్రీడలు

విశ్వక్రీడావేదికపై తెలుగు క్రీడా పతాకను రెపరెపలాడించాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారు. గతంలో ఒలింపిక్స్ పతకాన్నే సొంతం చేసుకున్న క్రీడల ఖిల్లా సిక్కోలు.. దీనిని అవకాశంగా తీసుకోవాలి. ప్రస్తుతం జిల్లాలో ఉన్న మైదానాలు, శిక్షకులు, క్రీడాప్రాంగణాలు, క్రీడావసతి గృహాలు, పరికరాలు ఇతర సౌకర్యాలతోపాటు అవసరమైన వసతుల సమాహారంతో కథనం

400 మీటర్ల ట్రాక్ ఏర్పాటు చేయాలి

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆటల్లో ప్రాథమిక శిక్షణా పద్ధతులకు కూడా నేడు 400మీటర్ల ట్రాక్ అవసరం. కానీ మన జిల్లాలో శ్రీకాకుళంలో తప్ప మరెక్కడా ఈ ట్రాక్ లేదు. దీంతో సాధనతో పాటే రాష్ట్ర, జాతీయ పోటీల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ ట్రాక్ ఏర్పాటు వల్ల నైపుణ్యంతో పాటు విజయాలూ సొంతమవుతాయి.

– కె.హరిబాబు, రాష్ట్ర సాంకేతిక కమిటీ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ సంఘం

పరికరాలతో రాటుదేలుతారు

జిల్లాలో అన్ని క్రీడాంశాలకు క్రీడాపరికరాలు కొరత తీవ్ర సమస్యగా పరిణమించింది. ఇప్పటికీ మన జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించాలంటే ఇతర జిల్లాలపై ఆధారపడాల్సి వస్తోంది. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్ వంటి క్రీడల పరికరాలు వ్యయం భారంగా మారింది. ప్రభుత్వం పరికరాలు అందిస్తే క్రీడాకారుల్లోని నైపుణ్యత వెలుగులోకి వస్తుంది.

– పి.తవిటయ్య, జాతీయ కార్యవర్గ సభ్యుడు, టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా



వజ్రపుకొత్తూరులో ప్రైవేటు స్థలంలో రాష్ట్రపోటీల నిర్వహణ (పాతచిత్రం)

వసతిగృహాలు.. అకాడమీలు: మన జిల్లాలో 1990- 2005 మధ్య ఉన్న క్రీడా వసతిగృహాలు, అకాడమీలలో నిరంతరం శిక్షణ సాగేది. కానీ నేడు అవేవీ లేవు. ఇంతటి క్రీడాప్రతిభ ఉన్న ఈ జిల్లాలో మళ్లీ వాటిని నెలకొల్పాలి.

వ్యాయామ ఉపాధ్యాయులు: 2022లో 117 ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం.. 92 మంది విద్యార్థులు కంటే తక్కువ ఉన్న పాఠశాలల నుంచి ప్రధానోపాధ్యాయులు, వ్యాయామవిద్య ఉపాధ్యాయులను తొలగించడం జరిగింది. దీంతో మన జిల్లాలో ఇలాంటి 40 స్కూళ్లకు పీఈటీలు లేని పరిస్థితి ఏర్పడింది..

శిక్షకులు: అథ్లెటిక్స్‌కు శిక్షకుడు ఉన్నప్పటికీ ఆయనే జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ముఖ్యశిక్షకునిగా ఉండడంతో పరిపాలనా వ్యవహారాలు చూడాల్సి రావడంతో పూర్తిస్థాయిలో శిక్షణకు అవకాశం లేకుండా పోయింది. అలాగే బాక్సింగ్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, హాకీ, తైక్వాండో, జూడో, హ్యాండ్‌బాల్, కబడ్డీ, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్ వంటి క్రీడలకు శిక్షకులు పొరుగుసేవల ప్రాతిపదికన ఉన్నారు. వీరికి ఉద్యోగభద్రత కల్పిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి.

బయట నుంచి రావాల్సిందే: రాష్ట్రవిభజన తర్వాత జిల్లాలో ఇంతవరకూ పూర్తిస్థాయిలో నాణ్యమైన క్రీడాపరికరాలు లేని పరిస్థితి ఉంది. రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించాలంటే ఇతర జిల్లాల నుంచి పరికరాలను తీసుకు రావాల్సిందే.

నేలకొరిగిన పంట



బలిజిపేట, న్యూస్‌టుడే: మండలంలోని నారన్నాయుడువలసలో సోమవారం మధ్యాహ్నం పెను గాలులు వీచి కొంతసేపు వర్షం కురిసింది. ఈ వానకు చిరు పొట్ట దశలో ఉన్న వరి పంట 10 ఎకరాల్లో నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సేంద్రియ ద్రావణంతో మేలు

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వరిలో తెగుళ్ల నివారణకు సేంద్రియ పద్ధతిలో తయారు చేసిన ద్రావణాలు పిచికారీ చేస్తే మంచి దిగుబడులు వస్తాయని ఎంసీఆర్పీ లక్ష్మి తెలిపారు. సోమవారం మిర్తివలసలో సప్త ధాన్యంకుర ద్రావణం తయారీపై అవగాహన కల్పించారు. గింజ బరువు, రంగు నాణ్యత పెరగడంతో పాటు తెలుపు, నలుపు కంకులు, పొల్లు గింజ సమస్య తగ్గుతుందన్నారు. వీఏఏ ప్రశాంతి, ఐసీఆర్పీ తిరుపతిరావు రైతులు పాల్గొన్నారు.

మాతృశాఖలో విలీనానికి డిమాండు

కలెక్టరేట్ ప్రాంగణం: సచివాలయాల్లో పని చేస్తున్న ఆరోగ్య కార్యదర్శులను వైద్యారోగ్య శాఖలో విలీనం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రమాదేవి, స్వర్ణలత డిమాండ్ చేశారు. సోమవారం సిబ్బందితో కలిసి కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. వీరికి సిటు నాయకులు మన్మథరావు, ఇందిరా మద్దతు తెలిపారు. ప్రస్తుతం పంచాయతీరాజ్, వైద్య శాఖల మధ్య విధులు నిర్వర్తించలేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కి వినతిపత్రం ఇచ్చారు.



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అయ్యప్ప స్వాములకు ఉచిత సేవలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అయ్యప్ప స్వామి దర్శనానికి శబరిమల వచ్చే మాలధారులకు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రసార సభ ఆధ్వర్యంలో ఉచిత అన్న ప్రసాదం అందిస్తున్నట్లు ఆ సభ జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్ పేర్కొన్నారు. సంబంధిత కరపత్రాలు పాలకొండలో సోమవారం అవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సభ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లతో అన్నదాన మందిరం నీలక్కల్‌కు అయిదు కిలోమీటర్ల ముందు నిర్మించామన్నారు. ఈ నెల 16 నుంచి ఇక్కడ రోజూ 25 వేల మందికి నిత్య అన్నప్రసాదం అందజేస్తామన్నారు. విశ్రాంతి గదులు, వాహన వసతి తదితర సేవలు ఉచితంగా చేరువ చేస్తామన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.రుద్రకోటేశ్వరరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శంకరాచార్యులు, గురుస్వామి, భక్తులు పాల్గొన్నారు.

మురుగు నీటి కాలువలు అధ్వానం



వజ్రపుకొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లోని మురుగునీటి కాలువల్లో చెత్త తొలగించకపోవడంతో పలు చోట్ల మురుగు నిలిచింది. దోమలు విజృంభిస్తుంటంతో ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రెయ్యిపాడులో ఈ పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఇక్కడ పాతరెయ్యిపాడులోని రెండు వీధుల పెరటాల మురుగునీటి కాలువలు నెలల తరబడి పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. తక్షణమే మురుగు నీటి కాలువలు శుభ్రపరచాలంటూ స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మోహని మాట్లాడుతూ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

మెష్‌లు ఏర్పాటు చేయరూ..

మందస మండలం చినకోష్టలోగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో డార్మిటరీ, తరగతి గదుల కిటికీల మెష్‌లు చిరిగి పాడయ్యాయి. రోజు రాత్రి సమయంలో దోమలతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. దోమల విజృంభణతో పిల్లలు తరచూ జ్వరాల బారిన పడుతున్నారని బాలికల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త మెస్‌ల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులతో మాట్లాడతామని హెచ్‌ఎం తిరుపతిరావు తెలిపారు.



– న్యూస్‌టుడే, మందస

నెలలుగా పేరుకుపోయి



కంచిలి మండలం మఠం కంచిలి నుంచి సోంపేట వైపు వెళ్లే రహదారి పక్కన చెత్త, మాంసం దుకాణదారులు పడేసిన వ్యర్థాలు పేరుకుపోయాయి. ఆ మార్గంలో ప్రయాణించే వారు శ్మశానం వద్దకు వచ్చే సరికి దుర్వాసన వ్యాపిస్తుండటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాంబాబును 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్యపై స్థానికులతో చర్చించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

దుర్వాసన భరించలేకున్నాం..

పలాస ఆర్టీసీ డిపో సమీపంలో మురుగునీరు విడిచిపెడుతుంటంతో దుర్వాసనతో ఉండలేకపోతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివాజీనగర్ ప్రాంతంలోని మురుగునీటిని ప్రహరీగోడకు రంధ్రం పెట్టి వదిలేస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయంపై డిపో తరఫున పురపాలక కమిషనర్‌కు లేఖ ఇస్తే అనుమతి తీసుకుని కాలువల్లో పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పారిశుద్ధ్య విభాగ హెల్త్ అసిస్టెంట్ శేఖర్ తెలిపారు.

– న్యూస్‌టుడే, పలాస



గుంతల రహదారిలో ఇక్కట్లు



వజ్రపుకొత్తూరు మండలం పూండి బస్టాండ్ వద్ద మూడు రోడ్ల కూడలి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. వాటిలో మరుగుదొడ్ల నీరు చేరి స్థానికులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు గుంతల్లో చిక్కుకుని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ తిరుమలరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

పాఠశాల విద్య ప్రక్షాళన..!

- మండలానికి ఒకరే ఎంఈవో
- పాఠశాల సముదాయ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు



కంచిలి మండలం పి.కొజ్జిరియా ఉన్నత పాఠశాల ఏడో తరగతిలో ముగ్గురే విద్యార్థులు

గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో అస్తవ్యస్తంగా మారిన పాఠశాల విద్య ప్రక్షాళనకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. మండల స్థాయిలో వివిధ అంశాలపై వివరాలు ఆరా తీస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే కొన్ని నూతన విధానాలను అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. విలీన తరగతులను వెనక్కి పంపడం వంటివి వచ్చే ఏడాది నుంచి అమలులోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్‌టుడే, సోంపేట, పోలాకి

గత ప్రభుత్వ హయాంలో మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించడంతో ఆధిపత్య పోరు నెలకొంది. పాత విధానంలో మాదిరిగా ఒక ఎంఈవోను కొనసాగిస్తూ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కీలక బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాల సముదాయాలను నవీకరించనున్నారు. ఒక్కో సముదాయ పరిధిలో 50 మంది ఉపాధ్యాయులు ఉండేలా చూస్తున్నారు మండలానికి 10 నుంచి 12 వరకు ఉన్న సముదాయాల సంఖ్య సగానికి తగ్గుతుంది. నిర్దేశిత సంఖ్యలో ఉపాధ్యాయులు సముదాయాలకు హాజరైతే బోధన, ఇతర అంశాలపై చర్చ, శిక్షణ కార్యక్రమాలు, అవగాహన తరగతులకు అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం తక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు ఉండటంతో నామమాత్రంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీన్ని ప్రక్షాళన చేయడానికి అవసరమైన కసరత్తు పూర్తి చేశారు. ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ, ఇతర బాధ్యతలను సంబంధిత ప్రధానోపాధ్యాయులకు అప్పగించనున్నారు. పాఠశాల సముదాయ ఛైర్మన్‌గా వ్యవహరించే ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కీలక బాధ్యతలు నిర్వహించనున్నారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును అధ్యయనం చేసి కలెక్టర్ ఆధ్వర్యంలో మెనూ రూపొందిస్తారు.



పోలాకి మండలం తెల్లవానిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినికి బోధిస్తున్న ఉపాధ్యాయుడు

విలీన తరగతులు వెనక్కి..

వీలినం పేరిట జిల్లాలో 223 పాఠశాలల నుంచి విద్యార్థులను వేరే బడులకు పంపడంతో ప్రాథమిక పాఠశాలల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వం నిర్వాకంతో 485 పాఠశాలల్లో 10 మంది లోపు విద్యార్థులు ఉన్నారు. అందులో ఒకరిద్దరు పిల్లలున్న పాఠశాలలు అధికంగా ఉన్నాయి. ఒకటి, రెండు తరగతులకు పరిమితమైన పాఠశాలల్లో కొత్తగా పిల్లలు చేరే పరిస్థితి లేకుండా పోయింది. మూడో తరగతికి వస్తే మరో బడికి పంపాల్సి ఉండటంతో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపడానికే మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి కొత్త విధానం తీసుకురానున్నారు. మరోవైపు ప్రాథమిక పాఠశాలలకు 5 కి.మీ. దూరంలో ఉన్నత పాఠశాల లేని చోట్ల మాత్రమే ప్రాథమికోన్నత బడిని కొనసాగించాలని చర్చిస్తున్నట్లు సమాచారం. పంచాయతీకి ఓ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలనే యోచన చేస్తున్నారు.

జీవో 117 రద్దు చేయాలి..

3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలలకు పంపించాలి. జీవో 117 రద్దు చేయాలి. ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి అమలు చేయాలి. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించి బోధనకు అవకాశం కల్పించాలి.

- ఎస్.చాణక్య, జిల్లా కార్యదర్శి, ఏపీటీఎఫ్

రెండంచెల విధానం మంచిదే..

ప్రభుత్వం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్ని మాత్రమే నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తే ప్రాథమిక విద్య గాడిన పడుతుంది. ఎక్కువ మంది పిల్లలున్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించాలి. దూర ప్రాంతం నుంచి ఉన్నత పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీలు చెల్లించాలి.

- లండ బాబూరావు, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్

అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి

విలీన తరగతులను వెనక్కి పంపడం ద్వారా గ్రామీణ బడి పరిస్థితి మెరుగుపడుతుంది. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు పేరిట పట్టణాల్లో బడులను తగ్గిస్తే విద్యార్థులు ఇబ్బంది పడతారు. పాఠశాల విద్య ప్రక్షాళనకు ప్రభుత్వం చేస్తున్న కసరత్తు విషయంలో అందరి అభిప్రాయాలు, వాస్తవ పరిస్థితులు పరిగణనలోకి తీసుకోవాలి.

- రమేష్‌కుమార్ పాణిగ్రహి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీఆర్టీయూ

● జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1,915 ● ప్రాథమికోన్నత 315 ● ఉన్నత 419 ● విలీనం చేసినవి 223 ● పది మంది లోపు ఉన్నవి 485 ● విద్యార్థులు 1.60 లక్షలు

సూరంపేటలో కరిరాజులు

సీతానగరం: మండలంలోని గుచ్చిమి అటవీ ప్రాంతంలో పది రోజులుగా ఏనుగులు సంచరిస్తున్నాయి. వరి పంటను తొక్కేస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాన్నసీతారాంపురం, చిన్నరాయుడుపేట, సూరంపేట పరిధిలో రాత్రి వేళల్లో సంచరిస్తున్నాయని రైతులు వాపోతున్నారు.